# క్యూ

రావు అసహనంగా కదిలాడు

అర్ధరాత్రి దాటింది. అతని ముందు కొండవీటి చాంతాడంత క్యూ వుంది. నత్తనడకతో నడుస్తూంది క్యూ. నిరీక్షించి ప్రాణాలు పోతున్నాయి.

పదిన్నర గంటలు ప్రయాణం చేసి అమెరికా నుండి బాంబే వచ్చినా ఇంత అలసట కలగలేదు. కానీ ఇలా కస్టమ్స్ చెకింగ్ కౌంటర్ ముందు తన వంతు వచ్చేదాకా పడిగాపులు కాయడమంటే చెడ్డ విసుగు వస్తుంది. ఉన్నది ఒకటే కౌంటరు. దానిలోని ఆఫీసరుకి నిదానమే ప్రధానం అన్న సామెత వంటబట్టినట్టుంది.

" అన్‌సివిలైజ్డ్ "! విసుక్కున్నాడు. 'డర్టీ కంట్రీ! నో ప్రొగ్రెస్' మనసులో కసురుకున్నాడు.

రావు అంతగా విసుక్కోవడానికి వెయిటింగే కాకుండా ఇంకో కారణం కూడ వుంది. అతను క్యాచ్ చేయాల్సిన నెక్ట్స్ ఫ్లైట్ ఇంకో గంటలో బయలుదేరుతుంది. అక్కడనుంచి తన స్వంత ఊరు చేరుకోవాలి. తనవంతు రావాలంటే మరో గంట పట్టేటట్లున్నది.

రావు గొప్ప ఇంజనీరు. ఈ దేశం పద్ధతులపైనా, ఇచ్చే జీతాల పైన విసుగొచ్చింది. అమెరికాలో స్థిరపడిపోయాడు. గ్రీన్‌కార్డు హోల్డర్. బాంధవ్యాన్ని తెంచుకోలేక చుట్టపు చూపుగా సంవత్సరానికి ఒకసారి ఈ దేశానికి వస్తూ ఉంటాడు.

ఉన్నది ఒక్కటే కౌంటర్. చెకింగ్ నిదానం. అయ్యో రామా! ఇంతలో ఇంకో కౌంటర్ ఓపెన్ అయింది. ఆ ఆఫీసర్ సైగతో, మిరకిల్ లాగ, వెనకున్న ఎవర్నో పిలిచాడు. అతను ఆనందంగా అక్కడికి వెళ్ళిపోయాడు. రావుకి ఒళ్ళు మండిపోయింది.

" ఇదేం దేశమండి! క్యూ లేదు. పాడు లేదు. ఇంతమంది క్యూలో నించుంటే వెనకాల నున్న వాణ్ణి పిలుస్తారు. ఇదే అమెరికా అయితే ఎంత గొడవ జరుగుతుండేది. ఛ! ఛ! మనవాళ్ళు ఎపుడు నేర్చుకుంటారో డిసిప్లిన్". అంటూ ముందున్న సూటువాలాతో తెగ దుయ్యబట్టేశాడు ఇండియాను.

సూటు వాలా కూడ యిబ్బందిగా తలాడించాడు.

ఇండియాకు రాగానే యింత చేదు అనుభవం ఎదురవడం అతనికి నచ్చలేదు. రావు ఇండియా కల్చర్ గురించి తెగ చెబుతున్నాడు. " అస్సలు అలా పిలిస్తే వెళ్ళడానికి మనకు సిగ్గు ఉండాలికదండి. ఇంత మందిని వదిలేసి మన టర్న్ రానప్పుడు వెళ్లడానికి మనకైనా సెన్స్ ఉండద్దూ. డర్టీ ఇండియన్ కల్చర్!" ఇంకా ఆవేశంతో చెబుతూనే వున్నాడు, రావు.

" మాష్టారు మిమ్మల్ని పిలుస్తున్నారు." సూటువాలా చెప్పాడు. హఠాత్తుగా రావు ఠక్కున ఆపేసి తన లగేజి తీసుకుని కౌంటర్ వైపు వెళ్ళాడు! తనముందున్న క్యూను పట్టించుకోకుండా !

మరి రావు రక్తంలో ప్రవహిస్తున్నది ఇండియన్ కల్చరేగదా!